# వెళ్లిపో!

- తాటిపాముల మృత్యుంజయుడు

'హలో! అంత వడివడిగా ఎక్కడికి వెళ్తున్నావు?'

'ఏమో! నాకే తెలీదు. ఈ అడవి నన్ను ఎక్కడికి తీసికెళ్తే అక్కడికి వెళ్తాను.'

'అంటే గమ్యంలేని ప్రయాణమా? వృధాప్రయాస గదూ?'

'చేసే ప్రతీ పనికి గమ్యం ఉండాలా? లాభనష్టాలు బేరీజు వేయాలా? ఎలాంటి పట్టింపులు లేకుండా నా ఇష్టమొచ్చిన పని నే చెయ్యలేనా?'

'అది సరే! అలా తుప్పల్లో పడి నడనడమెందుకు? ఇలా ఈ కాలిబాటలో నడవొచ్చుగా?'

'ఇంతకు ముందు నడిచిన దారిలో ఎన్నో జ్ఞాపకాలు, మరెన్నో అనుభవాలు , కొన్ని బంధాలు అంటిపెట్టుకొని ఉంటాయి. ఎలాంటి గతంలేని కొత్త దారిలో ప్రయాణం చెయ్యలని నా కోరిక. అప్పుడే నేను స్వతంత్రం ఫీలవుతాను'

'స్వతంత్రమా? భార్యాపిల్లల్ని వదిలేసి ఇలా ఒంటరిగానా? వాళ్లేమైపోవాలి?'

'నాకు నేనే ఇంతవరకు పూర్తిగా అర్థం కాలేదు. ఈ జీవితం పూర్తయ్యేలోగా నేనేంటో నాకు తెలుస్తుందా అని అనుమానంగా ఉంది. నన్ను నేను తెలుసుకోటానికే అందర్ని వదిలేసి ఈ ఒంటరి ప్రయాణం. అవునూ! ఇంతకీ నువ్వెవ్వరూ?'

'ఏమిటీ? కొద్దిగా స్వతంత్రంగా ఆలోచించడం మొదలెట్టగానే నన్ను మర్చిపోయావా? నేనెప్పుడూ నీ తోడు ఉంటానుగా.'

'నాకే తోడు అక్కర్లేదు. నేను ఒంటరిగా ఉండాల్నుకుంటున్నానని చెప్పానుగా. నన్నొదిలేసి వెళ్లొచ్చుగా.'

'అది కష్టం. నీకు, నాకు తేడా లేదు. మనిద్దరం ఒక్కటే.'

'నువ్వు ప్రశ్నలడుగుతుంటే నేను జవాబులిస్తున్నానుగా. అంటే, నువ్వు, నేను వేరు వేరన్నమాట. ఇంతకీ నువ్వెవ్వరివో చెప్పు'

'నన్ను నేను ఎలా చెప్పుకోవాలో నాకు తెలియదు. నువ్వే నేను. నేనే నువ్వు.'

'నాకు నేనుగా స్వచ్ఛంగా ఉండాలనుకుంటున్నాను. నాకు ఒక 'ఆల్టర్ ఈగో' అవసరం లేదు.'

'మనిద్దరం ఏకత్వంలో భిన్నత్వానికి ఉదాహరణ. నాకు ఒక్కొక్కళ్లు ఒక్కొక్క పేరు పెట్టారు. అలాంటి పేరొకటి 'అంతర్వాణి'. ఆ గొడవంతా ఎందుకుగాని... ఇంకొంచెం ముందుకెళితే కీకారణ్యం మొదలవుతుంది. అందులో క్రూరమృగాలున్నాయి. బహు ప్రమాదం. వెనక్కి తిరుగు. ఇంటికెళ్దాం.'

'నీతో ఎప్పుడూ ఉండే గొడవ ఇదే. చిన్నప్పటినుండి నీతో సహా... అందరూ... నన్ను ఏదో ఒక విధంగా భయపెట్టేవారే. ఎప్పుడూ ఇది మంచి, అది చెడు అని హితబోధలు చేస్తూ, కట్టుబాట్లలో నడవాలని నిబంధనలు పెడుతూ, నన్ను ఒక బందీని చేసారు. వీటన్నిటినుండి నాకు విముక్తి కావాలి. నీ నుండి కూడా.'

'అది సాధ్యం కాదేమో. నాకు నీనుండి విముక్తి కావాలంటే మనిద్దరం ఒకే విధంగా ఆలోచించాలి. ఎలాంటి అభిప్రాయభేదాలు ఉండవద్దు. జోడెడ్ల బండిలా సాఫీగా సాగాలి. అప్పుడే నీకు, నాకు మధ్య ఈ ఘర్షణ ఉండదు. అయినా... ఇంత చదువు చదివి, మంచి ఉద్యోగాన్ని వదిలేసి అడవులపాలు అవుతావా?'

'చదివిన చదువు నన్ను విజ్ఞానవంతుణ్ణి చేయలేదు. ఒక మంచి పనివంతునిగా, ప్రశ్నలు వెయ్యకుండా, అనుమానాలు వ్యక్తం చేయకుండా కష్టపడి పనిచేసే బానిసలా తయారు చేసింది.'

'మనిషి సంఘజీవి. సంఘంలో బతకాలి. వెనక్కి పదా!'

'నేను ఈ జంఝాటం నుండి దూరంగా బతకాలనుకుంటున్నాను. మనిషి సంఘంలో బతకాలంటే తప్పకుండా ఏదో ఒక మతానికి, ఇజానికి, వాదానికి కట్టుబడుండాలి. లేకుంటే వెలివేసినట్టు చూస్తారు. అయినా ఈ మతాలు, ఇజాలు, వాదాలు మనుషుల సమస్యలను తీర్చటమేమోగాని వారిమధ్య వేర్పాటువాదాన్ని మాత్రం తీసుకొచ్చాయి. హింసను రేగొల్పాయి. కొన్ని దేశాల్లో మారణకాండను సృష్టించాయి. మనిషి సంఘజీవి... సంఘజీవి... అంటూ బాకా

ఊది ఐదు నిమిషాలు ఒంటరిగా ఉండాలంటేనే భయపడే స్థితికి మనిషిని చేర్చాయి.'

'జీవితంలో ఓడిపోయి పరిగెత్తే పిరికివాడివని అందరూ అనుకుంటారేమో. ఒకసారి ఆలోచించు.'

'ఈ సంఘంలో ప్రతి ఒక్కరూ, ప్రతీ విషయంపై ఏదో ఒక అభిప్రాయం ఏర్పరుచుకునే వారే. నాకు అభిప్రాయాలంటే భయం. మాట్లాడే మాటలకున్న అసలు అర్థాన్ని వదిలేసి మాటల వెనకాల పెడర్థాలను వెదికే మనుషులను వదిలి వెళ్తున్న వాణ్ణి. ఎవరేమనుకుంటేనేమి. అయినా, నాకొక అనుమానం.... ఈ బంధనాలన్నీ ఎలాగోలాగ వదిలించున్నా నీవు మాత్రం నన్ను వదిలేటట్టు లేవు. నీ నస తప్పేటట్టు లేదు. ఓ మనస్సా!... ఓ అంతరాత్మ!... ఓ అంతర్వాణి! నీ మూలం ఏమిటీ? జవాబు చెప్పు.'

'ఎంత నిలదీసి అడిగినా ప్రయోజనం లేదు. నువ్వేమనుకుంటే అదే నేను. నువ్వేమైతే అనుకోవో అది కాదు నేను. నీ పుట్టుక, నా పుట్టుక ఏకకాలంలో జరిగింది. నీకు మాటలాడడం రానప్పుడు కూడా నువ్వు, నేను అంతరంగంలో సంభాషించుకునే వాళ్ళం. అంతటి అనుబంధం మనది. నువ్వు, నేను ఏల్లప్పుడూ ఒకే మాటపై నిలబడడమే మన మధ్య సయోధ్య కుదరటానికి పరిష్కారం.'

'నీతో ఎప్పుడూ ఉండేదే ఈ చిక్కు. చిక్కకుండా దొరకకుండా సమాధానాలిస్తావు. నువ్వు లేకుండా నేను బతకాలనుంది.'

'ఎలా బతకాలనుంది నీకు?'

'జీవితాన్ని నిండుగా జీవించాలనుంది. అదిగో! ఆ చెట్టునుండి పండుటాకులు ఎలా రాలిపడుతున్నాయో చూడు. అలా చెట్టు ఆకులా జివించాలనుంది.'

'చెట్టు ఆకులాగానా?'

'అవును. చెట్టు ఆకు వసంతంలో చిగురిస్తుంది. వేసవిలో ఆకుపచ్చని రంగుతో శోభిస్తుంది. వయసు ఉడిగి, రంగు వెలిసి శీతాకాలంలో రాలి పోతుంది. ఒకరు చెప్పకుండానే, ఎలాంటి నిబంధనలు లేకుండానే అది జీవితాన్ని తనంతట తానుగా నిండుగా జీవిస్తుంది. కాబట్టి, నన్ను నీ

నుంచి విముక్తిణ్ణి చెయ్యి... **వెళ్లిపో...! వెళ్లిపో...! వెళ్లిపో...! ... అమ్మా...!!**'

***

సూర్యకాంతి చొచ్చుకురాలేని విధంగా దట్టమైన అడవి. నలుగురు కొండజాతి మనుషులు తేనేపట్టుకై బయలుదేరారు. మోకాళ్లలోతుగా మొలిచిన గడ్డిలోంచి, పిచ్చిమొక్కలోంచి భారంగా అడుగులు వేస్తూ ముందుకెళ్లుతున్నారు. అంతలో ఉన్నట్టుండి ఒక కోతి చెట్టుపై నుండి వాళ్ల ముందుకు దూకింది. దాన్ని విదిలించి ముందుకు సాగారు. అయినా ఆ కోతి వాళ్లవెంట అరుచుకుంటూ వెంబడించింది. వాళ్లు దాన్ని పట్టించుకోలేదు. ముందుకెళ్ళి వారికి అడ్డంగా నిలబడింది. మొర పెట్టుకుంటునట్టుగా మళ్లీ అరిచింది. ముందు కాలెత్తి ఒకదిక్కు చూపుతూ ఏదో సంజ్ఞలు చేసింది. కోతి తమకు ఏదో చెపుతున్నట్టుగా కొండజాతి మనుషులు అర్థం చేసుకున్నారు. కోతి దారి తీయగా వాళ్ళు దాన్ని వెంబడించారు.

కోతి ఒక పొద దగ్గర ఆగింది. ఆ పొదలో ఒక మనిషి బోర్లా పడి ఉన్నాడు. కొండజాతి మనుషులు లోనికెళ్లి మనిషిని బయటకు తీసుకొచ్చి వెల్లకిలా పడుకోబెట్టారు. కళ్లు సగం తెరిచివున్నాయి. నోటిలోనుండి నురుగులాంటి పదార్థం బయటకు వస్తున్నది. మనిషిని చూస్తే ఇంకా కొద్ది స్పృహలో ఉన్నట్టున్నాడు.

'మావా! ఈ మనిషిని ఏదో విషప్పురుగు కాటేసినట్టుంది. ఇంకా ప్రాణంతోనే ఉన్నాడు' ఆడమనిషి.

'మనం గనక కోతిని పట్టించుకోకుండా పోతే ఈ మనిషి చచ్చుండేవాడు' అన్నాడు ఓ మగమనిషి గుండెచప్పుడును చెవితో వినటానికి ప్రయత్నిస్తూ.

'ఓ కోతి, నన్ను బ్రతికిస్తున్నందుకు థాంక్స్! ' అంటూ కొద్దిగా కదిలాడు మనిషి. పెదాలు సన్నగా కదులుతున్నాయి. మాటలు మాత్రం బయటకు రావటం లేదు. పెదాల చుట్టూ ఎండిపోయిన రక్తం మరకలు కూడా అగుపిస్తున్నాయి.

'పాదం దగ్గర చూడు. అక్కడ పాము కరిచినట్టుంది. పెద్ద గాయం అయింది' అంది ఇంకో

ఆడమనిషి.

'అవునే! బతకాలన్న ఆశతో పాము కరిచిన చోట తనే కొరుక్కుని కండ లాగేసుకున్నట్టున్నాడు. ఈ మనిషి చూస్తే చాలా మొండోడిలాగున్నాడు' అన్నాడు ఇంకో మగమనిషి.

'నేను మొండివాణ్ణి కాదు. ధైర్యవంతుణ్ణి. అందరిలాగే మీరూ అపార్థం చేసుకోకండి' అనుకుంటూ మనిషి కొద్దిగా కదిలాడు.

''అయినా... ఇంత దూరం ఈ అడవిలోనికి ఎందుకు వచ్చినట్టో? పామువాత పడకుంటే ఇంకెంత లోపలికి వెళ్ళే వాడో' అంది మొదటి ఆడమనిషి.

'నేనెళ్ళి పాము విషం విరుగుడికి ఆకుపసరు తీసుకొస్తాను' అంటూ లేచాడు మొదటి మగమనిషి.

'థాంక్స్! పసరేసి నన్ను బతికించండి. నేనిం కా ఈ అడవిలోతుల్లోకెళ్లాలి.' అంటూ మనిషి కదిలాడు.

ఆకుపసరు తీసుకొచ్చి పాము కరిచిన చోట వేసి 'పద, ఇతన్ని మన గుడిసెలకు తీసికెల్దాం. ఆ తర్వాత నేను పట్నం వెళ్ళి వీళ్ళ జాతి మనుషులకు చెబుతాను. వాళ్లొచ్చి ఈ మనిషిని తీసుకెళ్తారు' అంటూ మనిషిని లేపి నాలుగు దిక్కులా పట్టుకొని నడవడం మొదలెట్టారు. వాళ్ళ వెనుక కోతి నడవడం మొదలెట్టింది.

'నో! నో! అలా చెయ్యకండి. మా మనుషులకెవ్వరికి చెప్పకండి. నాకు వెనక్కి వెళ్ళాలని లేదు' అంటూ బలం తెచ్చుకొని కాళ్ళు, చేతులను కదిలించాడు. ఊహించని ఊపుకు మోస్తున్న మనుషులు తుళ్ళారు.

'అమ్మోయ్! పూర్తిగా తెలివి వస్తున్నట్టుంది. తిరిగి వాళ్ళ మనుషుల్లోకి వెళ్లాలని ఆరాటం కాబోలు' అన్నాడు ఒక మగమనిషి.

'కాదు... కాదు... నాకు ఎవ్వరిని చూడాలని లేదు...దయ చేసి నన్ను తిరిగి సమాజంలో కలపకండి... మీకు దండం పెడతాను' అస్పష్టంగా గొణుగుతూ చేతులెత్తటానికి ప్రయత్నించాడు.

కదుల్తున్న చేతుల్ని కట్టిపడేసినట్టు గట్టిగా పట్టుకున్నారు. మనిషి గిలగిలా తన్నటానికి ప్రయత్నం

చేసాడు.

మనిషి ఆతురత, ఆవేదన కొండజాతి మనుషులకు అర్థం కాలేదు. అన్నింటిని వదలుకోవాలనుకున్న మనిషిని తిరిగి సమాజంలోకి పంపాలనుకున్నారు.
అలా మథనపడుతున్న మనిషి బాధను కోతి అర్థం చేసుకున్నట్టుంది. దాని కళ్ళు చెమ్మగిల్లాయి. కాని, కోతి కంటతడిని ఎవ్వరూ చూడలేదు.
అప్పటివరకు వెంట నడిచిన కోతి చెట్లపై నుండి దూకుతూ తిరిగి తన గుంపు వైపుకు వెళ్ళింది.

***